సాక్షి
పార్వతీపురం మన్యం

సోమవారం । 18 । సెప్టెంబర్ । 2023



వైభవంగా పశలమ్మ పండగ

వేపాడ: వావిలపాడు గ్రామంలో పశలమ్మ పండగను గ్రామస్తులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. పంటలు సమృద్ధిగా పండాలని, పశువులు ఆరోగ్యం ఉండేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు.



మట్టి విగ్రహాల పంపిణీ

కురుపాం: వినాయక చవితి సందర్భంగా మండల కేంద్రంలోని కురుపాం డౌన్‌బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో 500 మట్టి వినాయక ప్రతిమలను ఆదివారం పంపిణీ చేశారు.

స్వచ్ఛభారత్ ర్యాలీ

పాలకొండ: స్వచ్ఛభారత్ కార్యక్రమంపై అవగాహన పెంచుకోవాలని నగరపంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. పట్టణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమంపై ఆదివారం ర్యాలీ నిర్వహించారు. కోటదుర్గమ్మ ఆలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారం ఏర్పాటుచేశారు. కౌన్సిలర్లు వెలమల మన్మథరావు, కిల్లారి మోహన్, కడగల రమణ, శంకరరావు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

20న జిల్లాకు ఎస్టీ కమిషన్ చైర్మన్ రాక

పార్వతీపురం: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు ఈ నెల 20వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లాకు రానున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి కె.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు గిరిజనులు, గిరిజన సంఘాల నేతలతో మాట్లాడి, సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు. ఏవైనా సమస్యల పరిష్కారానికి వినతిపత్రాలు కూడా ఆయనకు అందజేయవచ్చన్నారు.

అలరించిన పద్య నాటకాలు



పద్య నాటక పోటీల్లో ఓ దృశ్యం

పార్వతీపురం టౌన్: ఉత్తరాంధ్ర కళాకారుల సంక్షేమ సంఘం, శ్రీవాణి శివాని నాట్య కళామండలి ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన పద్యనాటక పోటీలు అలరించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు హాజరై మాట్లాడారు. ప్రాచీన కళలను కాపాడేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రాచీన సంస్కృతి, కళలను కాపాడుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్ల గోపాలరావుకు సన్మానించి ఆయనను అభినందించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర కళాకారుల సంఘం అధ్యక్షుడు బి.శ్రీరాములనాయుడు, కార్యదర్శి వంకాయల మారుతీప్రసాద్, శ్రీవాణి శివాణి నాట్య కళామండలి అధ్యక్షుడు ఎస్.సింహాచలం, కార్యదర్శి అమరాపు రామకృష్ణ, నారంనాయుడు, సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

షటిల్ విజేత కురుపాం



విజేతలను అభినందిస్తున్న అధికారులు

సీతంపేట: స్థానిక గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో ఆదివారం జరిగిన గిరి ఒలింపిక్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కురుపాం జట్టు విజేతగా నిలిచింది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలకు సంబంధించి జరిగిన గిరి ఒలింపిక్స్‌లో రెండు జిల్లాలకు చెందిన 50 జట్లు పాల్గొన్నట్లు ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకాబ్ దయానంద్ తెలిపారు. ఈ పోటీల్లో కురుపాం జట్టు ప్లేయర్లు రవి, నిఖిల్‌లు విన్నర్లుగా నిలిచారు. శ్రీకాకుళం జట్టుకు చెందిన అభిరామ్, కార్తీక్‌లు రన్నర్లుగా గెలిచారు. సాలూరుకు చెందిన చిన్నారావు, భరద్వాజ్‌లు మూడో స్థానంలో నిలిచారు. విజేతలకు మెమెంటోలు, బహుమతులు ఐటీడీఏ ఏపీఓ రోషిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకాబ్ దయానంద్, ఇంటర్నేషనల్ బ్యాట్మింటన్ రిఫరీ సూరిబాబు, పీడీ రామకృష్ణ, మధు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న డాక్టర్ భావన

విజయనగరం ఫోర్ట్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన అన్నారు. స్థానిక డీసీఎంఎస్ కార్యాలయంలో మట్టి వినాయకులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనం ఏ కార్యక్రమాలు తలపెట్టిన విఘ్నాలు రాకుండా వినాయకున్ని పూజిస్తామని తెలిపారు. విద్యను, జ్ఞానాన్ని ప్రసాదించే దేవుడు విఘ్నేశ్వరుడని విద్యార్థులైన బాలబాలికలు విఘ్నేశ్వరుడి పూజను భక్తి శ్రద్ధలతో చేసుకోవాలన్నారు. మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలతో సహజ సిద్ధమైన ఫలాలు, పత్రాలు, వంటకాలతో చవిత పూజలను చేయడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. పర్యావరణానికి హాని జరగకుండా ప్రతి ఒక్కరు మెలగాలన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామ రాజు జిల్లాల యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జి అవనాపు విక్రమ్ పాల్గొన్నారు.

వృద్ధి కోరి.. సమృద్ధిగా..

అన్ని రంగాల అభివృద్ధే లక్ష్యంగా ఆయా రంగాల్లో ఉన్న వారికి రుణాలను మంజూరు చేయించడం ద్వారా ప్రభుత్వం వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడుతోంది. ఇందుకు జిల్లా అధికార యంత్రాంగం తన వంతు ప్రణాళికలు రచిస్తూ పక్కాగా అమలు చేస్తూ చేయూతనందిస్తోంది.

- గతం కంటే మిన్నగా రుణాల మంజూరు
- పెరిగిన స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణ లక్ష్యం
- వ్యవసాయానికి అగ్ర తాంబూలం
- 2022 – 23లో ఇచ్చిన రుణ లక్ష్యం రూ.1864.34 కోట్లు
- జిల్లాలో 2023 – 24 లక్ష్యం రూ.2528.91 కోట్లు

పార్వతీపురం టౌన్:

వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల పురోభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం ఆయా రంగాలకు పెద్ద పీట వేస్తోంది. ప్రభుత్వ రంగ, ప్రైవేట్ బ్యాంకుల ద్వారా రుణాలు కల్పించడం ద్వారా ఆయా రంగాల మీద ఆధారపడిన రైతులు, నిరుద్యోగులు, యువకులు, మహిళా స్వయంశక్తి సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ఆర్థికాభివృద్ధికి దోహదపడుతోంది. జిల్లాలో భారీ వర్షాలతో ఖరీఫ్ వరి నాట్లు జోరుగా సాగాయి. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా నిధులు ఖాతాలకు జమ చేసింది. మరోవైపు బ్యాంకు రుణాలు అవసరం మేరకు ఇప్పించడం ద్వారా సాగుకు ప్రభుత్వం ఊతమందిస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయ ఆధారిత జిల్లా కావడంతో బ్యాంకుల ద్వారా అందించే రుణాల విషయంలో ఆ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఆ తరువాత చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు, విద్యా, ఉద్యోగ, గృహ నిర్మాణాలు, ఎస్‌హెచ్‌జీ సంఘాలకు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా ప్రభుత్వం సంకల్పించింది. అందుకు అనుగుణంగా జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో కసరత్తు చేస్తుంది.

గత ఏడాదితో పోల్చుకుంటే...

గత ఏడాది మొత్తం రుణ లక్ష్యం రూ.1864.34 కోట్లు కాగా ఈ ఏడాది దాన్ని పెంచి రూ.2528.91 కోట్లు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. వ్యవసాయ రంగానికి గత ఏడాది రూ.1449.67 కోట్ల రుణాలు లక్ష్యం కాగా, ఈ ఏడాది ఏకంగా రూ.2190.55 కోట్లు రుణాలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఏడాది గతం కన్నా అధికంగా రూ.740.88 కోట్లు లక్ష్యంగా పెట్టుకోవడం విశేషం. ఎంఎస్‌ఎంఈలకు గత ఏడాది రుణ లక్ష్యం రూ.304.57 కోట్లు కాగా, రూ.219.75 కోట్లు అందించారు. ఈ ఏడాది రూ.221.56 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. గత ఏడాది ప్రభుత్వ ప్రాధాన్యత లేని రంగాలకు రూ.391.63 కోట్లు లక్ష్యం కాగా రూ.791.27 కోట్ల రుణాలు మంజూరు చేశారు. ఈ ఏడాది రూ.437.87 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు.

రైతులు, మహిళలు, నిరుద్యోగ యువతకు మేలు

రుణ కల్పన విషయంలో వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత అధికంగా లబ్ధి పొందనున్నారు. వ్యవసాయ, ఉద్యాన, పాడి, ఆక్వా సాగు చేసే భూములున్న రైతులతో పాటు కౌలుదారులలో పంట సాగుదారుల హక్కుల కార్డు (సీసీఆర్సీ), జాయింట్ లైబులిటీ గ్రూప్ (జేఎల్జీ), కిసాన్ క్రెడిట్ కార్డు (కేసీసీ), ప్రధానమంత్రి ఫార్మలేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఎఫ్ ఈ), ప్రధానమంత్రి ముద్రయోజన (పీఎంఎంవై)లలో వేలాది మంది లబ్ధి పొందనున్నారు.



వరినాట్లు వేస్తున్న రైతులు (ఫైల్)



సాగులో రైతన్న (ఫైల్)

లక్ష్యానికి మించి..



గత ఏడాది ఇచ్చినట్టుగా ఈ సంవత్సరం కూడా లక్ష్యానికి మించి రుణాలు ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. జిల్లా కమిటీ సూచనల మేరకు రైతులకు, మహిళలకు, నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున రుణాలు ఇవ్వడం ద్వారా వారి అభ్యున్నతికి బ్యాంకింగ్ వ్యవస్థ అండగా ఉందని నిరూపిస్తాం.

– జేఎల్ఎస్ మూర్తి, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్, పార్వతీపురం మన్యం

జిల్లాలో 2022 - 23లో కీలక రంగాల్లో రుణ వివరాలు రూ.కోట్లలో..

రంగాలు	గత ఏడాది లక్ష్యం (కోట్లలో)	ఇచ్చింది (కోట్లలో)	ఈ ఏడాది లక్ష్యం (కోట్లలో)
వ్యవసాయ స్వల్పకాలిక రుణాలు(ఖరీఫ్)	625.51	749.51	834.40
వ్యవసాయ స్వల్పకాలిక రుణాలు(రబీ)	434.67	520.83	579.84
దీర్ఘకాలిక రుణాలు	389.49	967.39	776.31
సూక్ష్మ తరహా సంస్థలకు		130.23	93.96
చిన్న తరహా సంస్థలకు	112.34	81.05	48.58
మధ్య తరహా సంస్థలకు	62.00	44.74	19.21
విద్యా రుణాలు	8.89	5.43	10.05
గృహ రుణాలు	68.11	21.75	55.26
ప్రభుత్వ ప్రాధాన్యత లేని రంగాలకు	391.63	791.27	437.87

జిల్లాలో లబ్ధి పొందే వివిధ వర్గాల వారి వివరాలు

పథకం	రుణం పొందే వారు	పొందే రుణం (రూ.కొట్లలో..)
కేసీసీ పశు సంవర్ధక శాఖ	1823	16.40
కేసీసీ ఫిషరీఫ్	38	1.94
సీసీఆర్‌సీ	1700	16.75
జేఎల్‌జీ/ఆర్ఎంజీ	300	10.00
ఇతర రైతులు	200	0.90
యాంత్రీకరణ	596	39.80
డెయిరీ	4350	180.76
పౌల్ట్రీ	12	12.20
ఫిషరీష్	2	3.50
పీఎంఎఫ్ఎంఈ	10	1.00
ఎస్‌హెచ్‌జీ గ్రామీణం	8596	407.94
పీఎంఎంవై	12800	130.00

ఏనుగుల సంచారంపై తస్మాత్...



- జిల్లా అటవీ అధికారి జీపీపీ ప్రసూన

పార్వతీపురం టౌన్/కొమరాడ: వినాయక చవితి పండుగ నేపథ్యంలో ఏనుగుల సంచారంపై అటవీ శాఖ ఆయా ప్రాంతాల ప్రజలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తం చేసింది. ఈ మేరకు ఆదివారం జిల్లా అటవీ అధికారి జీపీపీ ప్రసూన ఒక ప్రకటన విడుదల చేశారు. ఒంటరి ఏనుగు హరి ఆర్తాం కొండపై ఉందని, మిగిలిన ఏడు ఏనుగుల గుంపు పార్వతీపురం రేంజ్ దుగ్గి ముంపు ప్రాంతంలో ఉండగా, నాలుగు ఏనుగుల గుంపు కురుపాం రేంజ్‌లో జరడ గ్రామం వద్ద ఉన్నాయని ఆమె తెలిపారు. వినాయక చవితి సందర్భంగా మానవ–జంతు సంఘర్షణలు జరగకుండా ఏనుగుల జాడ ఎప్పటికప్పుడు గమనించేందుకు అటవీ సిబ్బంది సంఖ్యను పెంచామని వివరించారు. ఈ మేరకు సురక్షితంగా ఉండటానికి కొన్ని సూచనలు చేస్తూ వాటిని పాటించాలని ఆమె కోరారు. వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మైక్ (సౌండ్ సిస్టం)ల నుండి 70 డేసిబుల్స్ శబ్దం కంటే తక్కువగా ఉండేటట్లు చూడాలని, సాయంత్రం 6 గంటల తరువాత ఏనుగులు సంచరించే అవకాశం ఉన్న గ్రామాల్లో పాటలు వేయవద్దని కోరారు. కొమరాడ మండలంలో ముఖ్యంగా పాతదుగ్గి, కొత్త దుగ్గి, పాత కళ్ళికోట, కొత్త కళ్ళికోట, గారవలస, గంగడవలస, సోమినాయుడు వలస, కుమ్మరి గుంట, అంకులవలస, పంతులవలస, రావికర్రివలస, రాజ్యలక్ష్మిపురం, కందివలస, కొనవలస, కొత్తూరు, దంగభద్ర, పరశురాం పురం, చంద్రంపేట, పాత మార్కొండపుట్టు, కొత్త మార్కొండపుట్టు, గున్నానాపురం, గడబవలస, కొత్త గున్నానపురం, ఆర్తం చిన్నవలస, ఆర్తాం పెద్దవలస, విక్రంపురం, ఆర్థాం, కోటిపాం, కోదుల గుంప, గుంపగడబవలస, దలైపేట, బిట్రపాడు, మాదలంగి, వనం, కిచ్చాడ తోరుము, కొట్టు, జియ్యమ్మవలస మండలంలో బాసంగి, వెంకటాపురం, గిజబ, జరడ గ్రామాల్లో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వినాయక నిమజ్జనం తేదీ, సమయం, ప్రదేశాన్ని సంబంధిత బీట్ ఆఫీసర్‌కు తెలియజేయాలని, ఏనుగుల సంచారంపై సంబంధిత బీట్ ఆఫీసర్ నుండి ముందుగా సమాచారం పొందాలని సూచించారు. ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతంలో నిమజ్జనం జరపొద్దని, రాత్రి వేళల్లో వేకువ జాము వేళల్లో రహదారులపై సంచరించకుండా ఉండటం ఉత్తమని పేర్కొన్నారు. ఏనుగుల సంచారానికి సంబంధించిన సమాచారం పార్వతీపురం బీట్ ఆఫీసర్ (ట్రాకర్) 8790418198, కొమరాడ బీట్ ఆఫీసర్ – 9398468628, 9398452958, పూజారిగూడ బీట్ ఆఫీసర్ – 6303126934, 8309397085 నంబర్లకు తెలియజేయాలని సూచించారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రామిక మహిళా రాష్ట్ర నాయకురాలు పి.మణి

పార్వతీపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం మహిళా హక్కుల వ్యతిరేక విధానాలు విడనాడాలని శ్రామిక మహిళా రాష్ట్ర నాయకురాలు పి.మణి అన్నారు. బెలగంలో గల గిరిజన సామాజిక భవనంలో శ్రామిక మహిళా జిల్లా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మహిళా జిల్లా సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో, జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో మెడికల్ అండ్ హెల్త్, నర్సులు, స్కీమ్ వర్కర్లు, భవన నిర్మాణం, ఇంటి పని వారు, ప్రైవేట్ స్కూల్లో, హాస్పిటల్స్, కాలేజీల్లో, చిన్న పరిశ్రమల వంటి రంగాలలో శ్రామిక మహిళలు అత్యధిక సంఖ్యలో పని చేస్తున్నారని, పురుషులతో సమానంగా పని చేస్తున్న మహిళలకు మాత్రం సమాన వేతనం అందడం లేదన్నారు. శ్రామిక మహిళల సమస్యలు పరిష్కరించాలని, అధిక ధరలు తగ్గించాలని, నిత్యవసర సరుకులను చౌక ధరల దుకాణం ద్వారా సరఫరా చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎం.గౌరమ్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.మన్మధరావు, కోశాధికారి గొర్లి వెంకటరమణ, నాయకులు వి.ఇందిరా, బి.సూరిబాబు, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, జిల్లా వ్యాప్తంగా శ్రామిక మహిళలు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ రాష్ట్ర సీనియర్ జట్టు ఎంపిక



ఎంపికైన సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి జట్టు

బొబ్బిలి:

కర్నూలులో త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనే మెన్, విమెన్ సీనియర్ జట్లను ఎంపిక చేశారు. మండలంలోని పారాది జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివా రం జరిగిన ఎంపిక కార్యక్రమానికి సుమారు వంద మంది హాజరయినట్టు ఎంపిక కమిటీ సభ్యులు తెలిపారు. వారిలో ప్రతిభావంతుల ను ఎంపిక చేసినట్టు ఎంపిక కమిటీ సభ్యులు సత్యనారాయణ, వెంకట నాయుడు, శ్రీను చెప్పారు.



మార్కెట్‌లో చవితి సందడి

గణనాథుడి తొలి పూజకు భక్తులు సిద్ధమయ్యారు. పూజా సామగ్రి కొనుగోలు కోసం మక్కువ మార్కెట్‌కు భక్తులు ఆదివారం పోటెత్తారు. దీంతో మార్కెట్‌లో చవితి సందడి నెలకొంది. ఇదే సమయంలో వినాయక ప్రతిమలను కమిటీల సభ్యులు విగ్రహ తయారీ కేంద్రాల నుంచి మండపాలకు తరలించారు. మరోవైపు వినాయక త్రిరాత్రి, నవరాత్రి ఉత్సవాలు జరిపేందుకు భక్తులు అన్ని చోట్ల ఏర్పాట్లు చేశారు.

– మక్కువ

ఉద్యానవన రైతులకు ప్రోత్సాహం

మన్యంలో గతం కంటే మెరుగ్గా ఉద్యానవన పంటల సాగు వైపు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం అందుతుండడంతో వీటి సాగు విస్తీర్ణం క్రమేణ పెరుగుతోంది.

- కోకోనట్, పామాయిల్ తోటల పెంపకానికి చర్యలు
- సబ్సిడీపై యూనిట్లు మంజూరు
- జీడి, మామిడి, జామ మొక్కల పంపిణీ
- గోదాంలు నిర్మించిన రైతులకు రూ.21లక్షల రాయితీ
- సోలార్ కోల్డ్ స్టోరేజ్ నిర్మించుకుంటే రూ.9.25 లక్షల సబ్సిడీ



కుశిమిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన అధికారి పేడాడ జయశ్రీ (ఫైల్)

సీతంపేట: ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుండడంతో మన్యంలో చిన్న, సన్నకారు రైతులు ఉద్యానవనాల వైపు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో దాదాపు 20 వేల హెక్టార్ల వరకు ఉద్యానవనాలు విస్తరించి ఉన్నాయి. జీడి, మామిడి, జామ, బొప్పాయితో పాటు సీతాఫలం, పైనాపిల్, పసుపు వంటి పంటలు విస్తారంగా పండుతాయి. కొన్ని రకాల పండ్లు తక్కువ కాలంలోనే పాడైపోతాయి. దీంతో రైతులు నష్టపోతున్నారు. వీటన్నింటి దృష్ట్యా ప్రభుత్వం కొత్తగా కోల్డ్ స్టోరేజీలు, గోదాంల నిర్మాణానికి చర్యలు తీసుకుంటుంది. దీనిలో భాగంగా రైతులకు భారీగా రాయితీలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల గోదాంలు నిర్మాణం జరుగుతుంది. పండించిన కూరగాయలు తక్కువ కాలంలో చెడిపోకుండా నిల్వ ఉంచుకోవడానికి వీలుగా అవసరమైన 30 టన్నుల కెపాసిటీ కలిగిన సోలార్ కోల్డ్ స్టోరేజి నిర్మించుకోవడానికి ఉద్యానవన శాఖ గణాంకాల ప్రకారం రూ.12.50 లక్షలు ఖర్చవుతుంది. దీనికిగాను ఉద్యానవన శాఖ రూ.9.25 లక్షల రాయితీ ఇస్తుంది. అంటే రైతు సంఘాలు కేవలం రూ.3.25 లక్షలు పెట్టుబడి పెడితే సరిపోతుంది. ఇప్పటికే జిల్లాలో సీతంపేట, వీరఘట్టం, నెల్లిగండిలలో వీటిని నిర్మించారు. 200 మంది రైతులు సంఘంగా ఏర్పడి 5నుంచి 10 గ్రామాల పరిధిలో ఉండే ఉద్యాన రైతులు 30 టన్నుల కెపాసిటీ గల కోల్డ్ స్టోరేజి రూ.27లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తే రూ.21 లక్షల రాయితీ వస్తుంది. రైతులు కేవలం రూ.6లక్షలు తన వాటాగా పెట్టుకుంటే సరిపోతుంది.


ఇదీ పరిస్థితి .

వైకేపీ ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో రైతు గ్రూపులు ద్వారా వాళ్ల పండించిన పంటలు దాచుకోవడానికి అవసరమైన గోదాములను 60 అడుగుల పొడవు, 40 అడుగుల వెడల్పులో పూర్తిగా గాలి, వెలుతురు సోకే విధంగా ఒక రేకుల షెడ్‌ను 2,400ల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించుకోవాలి. భూమిని ఇచ్చే దాతలు ఉంటే 25 సెంట్లు రైతు సంఘం పేరిట రిజిస్టర్ చేయాలి. పదేళ్ల కాలపరిమితిలో రిజిస్టర్ లీజ్ ఇవ్వాలి. అప్పుడు రైతు సంఘాలు రూ.15 లక్షల విలువైన గోదాం నిర్మించుకోవచ్చు. దీనికి ప్రభుత్వం రూ.11.25 లక్షల రాయితీ ఇస్తుంది. రైతులు కేవలం రూ.3.75 లక్షలు లబ్ధిదారుల వాటాగా చెల్లిస్తే సరిపోతుంది. ఇప్పటికే జిల్లాలో వీటిని వీరఘట్టం, పాచిపెంట, తోనం, గజిలి, దిగువకలువరాయి, సీతంపేట, భామిని గుమ్మలక్ష్మీపురం, రేగుమానుగూడ గ్రామాల్లో నిర్మించారు. ఇంకా నిర్మించుకుంటే పూర్తి స్థాయిలో ప్రోత్సాహిస్తామని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. ఆయిల్‌పామ్ కొత్తగా వేసుకున్న రైతులు, పాత రైతులు వారితోట చుట్టూ సిమెంట్ ఫోల్స్ దానికి లింక్ మెష్‌తో ఫెన్సింగ్ వేసుకుంటే దానికి కూడా ప్రత్యేక రాయితీ ఇవ్వనున్నారు. జీడి, మామిడి, జామ తదితర తోటలు వేసుకుంటే మొక్క ధర రూ.60 కాగా ప్రభుత్వం రూ.40 సబ్సిడీ ఇస్తుంది. లబ్ధిదారుడు రూ.20 కట్టాల్సి ఉంటుంది.



గజిలిలో నిర్మించిన అటవీ ఉత్పత్తుల కలెక్షన్ సెంటర్

ఉద్యానవన అధికారిని సంప్రదించాలి



మండల స్థాయి హార్టీకల్చర్ అధికారిని సంప్రదించినట్టయితే ఎలా దరఖాస్తు చేయాలి, ఇతర వివరాలు చెబుతారు. అలాగే ఆర్బీకేల ద్వారా కూడా తెలుసుకోవచ్చు. ముందుకు వచ్చే ఉద్యానవన రైతులకు అన్ని రకాల ప్రోత్సాహించడం జరుగుతుంది.

– సత్యనారాయణరెడ్డి, జిల్లా ఉద్యానవన అధికారి

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి



ఉద్యానవనాలకు ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సాహిస్తుంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి. పెద్ద మొత్తంలో సబ్సిడీ ఏ ప్రభుత్వ హయాంలో కూడా ఇవ్వలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భారీగా సబ్సిడీలు అందజేస్తుంది. మన్యం రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– విశ్వాసరాయి కళావతి, పాలకొండ ఎమ్మెల్యే

క్లుప్తంగా

చెరువులోకి దూసుకెళ్లిన కారు



చేపల చెరువులో పడిన కారు

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామ సమీపంలోని చేపల చెరువులోకి ఓ కారు దూసుకెళ్లింది. అదృష్టవశాత్తు అందులోని ప్రయాణీకులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఆదివారం పాలకొండ నుంచి రాజాం వైపు వస్తున్న కారు అదుపుతప్పి, చెరువులో పడిపోయింది. స్థానికుల సహాయ ప్రొక్లెయినర్ సహాయంతో కారును బయటకు తీశారు.

గాయత్రి మంత్రానికి మించినదేదీ లేదు..



ఆధ్యాత్మిక ప్రవచనం చెబుతున్న స్వప్నహైందవి

విజయనగరం టౌన్: గాయత్రి మంత్రానికి మించినదేదీ లేదని రాజాం ప్రభుత్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.స్వప్నహైందవి అన్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో టీటీడీ భక్తభజన మండలి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వేదం అంటే జ్ఞానమని, వేదాన్ని ఎవరైతే ఆచరిస్తారో ఆ వేదం వారిని రక్షిస్తుందన్నారు. మానవజాతికి బ్రహ్మజ్ఞానం తెలుసుకునే మార్గాలను మన మహర్షులు తెలిపారన్నారు. అనంతరం భక్త భజన మండలి ప్రతినిధులు ఆమెను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

లిఖిత్‌కు ఎమ్మెల్యే చేయూత



లిఖిత్‌కు క్రికెట్ కిట్, నగదు అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: ఆంధ్రప్రదేశ్ బధిరుల క్రికెట్ అసోసియేషన్ 7వ టి–20 క్రికెట్ చాంపియన్‌షిప్‌కు జిల్లా నుంచి ఎంపికైన భోగాపురం మండలం సుందరపేట గ్రామానికి చెందిన కట్టిరిశెట్టి లిఖిత్‌కు నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చేయూత అందించారు. మోపాడలోని ఎమ్మెల్యే తన స్వగృహంలో లిఖిత్‌కు క్రికెట్ కిట్‌తో పాటు రూ.10 వేలను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుందర హరీష్, పడాల శ్రీను, గోపి, సుందర వెంకటన్న, ఎంపీటీసీ సభ్యుడు బంగారాజు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత..

భోగాపురం మండలంలోని కొయ్యపేట గ్రామానికి చెందిన బాకి సూరమ్మకు రూ.5 లక్షల వైఎస్సార్ బీమా మంజూరుపత్రాన్ని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అందజేశారు. బాకి సూరమ్మ భర్త ప్రమదవశాత్తూ మరణించారు. దీంతో వైఎస్సార్ బీమా మంజూరైంది.

ఘనంగా విశ్వకర్మ జయంతి

విజయనగరం: విశ్వకర్మ జయంతి ఉత్సవాలు నగరంలో ఆదివారం ఘనంగా జరిగాయి. సంప్రదాయరీతిలో విశ్వకర్మ విగ్రహాలను నెలకొల్పారు. స్థానిక రామారాయుడు రోడ్‌లో నిర్వహించిన విశ్వకర్మ జయంతి ఉత్సవాలలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొని ప్రత్యేక పూజలు చేశా రు. అలాగే నాలుగో డివిజన్‌లో బధిర పాఠశాల ప్రాంతంలో నెలకొల్పిన విశ్వకర్మ జయంతి వేడుకల్లో కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మారో జు శ్రీనివాసరావు మాట్లాడుతూ, విశ్వకర్మ జయంతిని అధికారిక పండగగా నిర్ణయిస్తూ ప్రభుత్వం జీఓ 24 విడుదల చేయడం ఆనందంగా ఉందన్నా రు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జనాప్రసాద్, ముక్కామల శ్రీనివాసరావు, వరాహాచారి, పెదగాడ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380–00
బంగారం(22సి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹138	₹246	₹ 256

గణపయ్యా.. అందుకో మా తొలిపూజ

- వినాయక ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి
- ఆరోగ్య సూత్రాలతో ముడిపడిన పండగ
- కళాకారులకు ఉపాధినిచ్చే వేడుక కూడా..
- పూజలకు మట్టిప్రతిమలకే ప్రాధాన్యం
- నేడు వినాయక చవితి పండగ



రాజాం మార్కెట్‌లో వినాయక విగ్రహాల అమ్మకాలు

రాజాం: మన భారతీయుల అతిముఖ్యమైన పండగల్లో వినాయక చవితి ఒకటి. పార్వతీపరమేశ్వరుల కుమారుడైన వినాయకుడి పుట్టినరోజున ఏటా మనం ఈ ఉత్సవాలు జరుపుకుంటాం. భాద్రపద మాసం శుద్ధ చతుర్థి శుభసమయంలో హస్తనక్షత్రం రోజున ఈ వేడుకలు ప్రారంభమవుతాయి. చిన్నారుల దగ్గర నుంచి పెద్దల వరకు అందరికీ ఇష్టమైన పండగ ఇది. నవరాత్రి ఉత్సవాలన్ని రోజులు అందరూ చాలా ఆనందంగా తమ కాలం గడుపుతారు. ఈ పండగ రోజుల్లో వాడే పూజసామగ్రి కూడా ఆరోగ్యాన్ని కాపాడేవి కావడం విశేషం. అంతేకాకుండా ఈ పండగ ఎంతోమంది చేతివృత్తుల వారికి, శిల్పులకు ఉపాధి కల్పిస్తుంది. కుల, మతాలకు సంబంధం లేకుండా అందరూ ఎంతో సరదాగా జరుపుకునే ఈ వేడుక ఇదొక్కటే కావడం గమనార్హం. నేడు వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక కథనం

అందరినీ ఒక్కటి చేసే పండగ..

భారతీయులందరినీ ఒక్కటి చేసే పండగ వినాయక చవితి. ఆనాటి బ్రిటిషర్ల పాలనా కాలంలో సైతం ఇదే వినాయక చవితి భారతీయుల్లోని ఐక్యతాభావాన్ని తట్టిలేపింది. ప్రజావ్యతిరేక అసెంబ్లీ చట్టం ద్వారా హిందూ సమావేశాలను అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించగా, లోకమాన్య తిలక్ వినాయక చవితి పండగను అన్ని ప్రాంతాల్లో చేయించి, సామూహిక, సామాజిక, సార్వజనీన ఏకత్వాన్ని భారతీయుల్లో పెంపొందించారు.

నైవేద్యం.. ఆరోగ్యదాయకం..

కొత్త సంప్రదాయాలతో పాటు కొత్త వంటలు రావడంతో పాతరుచులను అందరూ మర్చిపోతున్నారు. అటువంటి సమయంలో వినాయక చవితికి విఘ్నేశ్వరునికి వండిపెట్టే బెల్లం ఉండ్రాలు, కుడుములు, పప్పుండ్రాలు, బెల్లం, పరమాన్నం, పాయసం వంటి వంటలు ప్రాచీన రుచులను పరిచయం చేస్తాయి. ఈ వంటకాలన్నీ కూడా పోషకాలను కలిగి ఉండి, మనకు ఆరోగ్యాన్ని అందిస్తాయి. ఈ నైవేద్యాలు ఆరోగ్యదాయకమని పెద్దలు చెబుతుంటారు.

నిమజ్జనోత్సవం..ఆనందమయం..

వినాయక చవితి ఉత్సవాలకు అన్ని ప్రాంతాల్లో మండపాలు తయారయ్యాయి. చిన్నారులు, యువత, వ్యాపారా సంఘాలు, వార్డు ప్రతినిధులు, కుల సంఘాలు, విద్యార్థులు ఇలా అందరూ తమ మండపాలు ఏర్పాటు చేసుకున్నారు. మూడు రాత్రుల దగ్గర నుంచి 12 రాత్రుల వరకు ఈ ఉత్సవాలు జరుపుతారు. అనుప పండగ రోజు(నిమజ్జనోత్సవం) సందడి అంతా ఇంతా కాదు. అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు ఇలా ఎన్నో కార్యక్రమాల మధ్య వినాయక నిమజ్జనోత్సవం ఎంతో ఆనందంగా జరుపుతారు.



వినాయక చవితి సందర్భంగా రాజాంలో ఏర్పాటు చేసిన మండపం

ఆరోగ్య పత్రాలు..

భాద్రపద శుద్ధచవితి నాడు వినాయక మండల తూర్పు ఆకాశంలో ఉదయిస్తుంది. అదేరోజున వినాయక వ్రతం చేసుకుంటాం. వినాయకుని వ్రతానికి 21 రకాల పత్రాలతో పూజిస్తే మంచిదనే భావన ప్రచారంలో ఉంది. ఇవే 21 పత్రాలు ఆరోగ్యాన్ని కూడా కాపాడే పత్రాలు కావడం విశేషం.

01.మాచీపత్రం, 02.బృహతీపత్రం(వాకుడాకు), 03.బల్వపపత్రం(మారేడుపత్రం),04.గరిక, 05.దుత్తూరుపత్రం(ఉమ్మెత్త ఆకు), 06.బదరీపత్రం(రేగిఆకు), 07.అపామార్గపత్రం(ఉత్తరేణిపత్రం), 08.తులసీపత్రం, 09.చూతపత్రం(మామిడి ఆకు), 10.కరవీరపత్రం(గన్నేరుపత్రం), 11. విష్ణుక్రాంతపత్రం, 12.దాడిమీపత్రం(దానిమ్మపత్రం), 13.మరువకపత్రం, 15.సింధూరపత్రం, 16. జాజిఆకు, 17.గండకీపత్రం, 18.శమీపత్రం(జమ్మి ఆకు), 19.అశ్వత్థపత్రం(రావి ఆకు), 20. అర్జునపత్రం(మద్ది ఆకు), 21.అర్కపత్రం(జిల్లేడు పత్రం). వినాయక పూజల్లో ఉపయోగించే ఈ 21 పత్రాలు మంచి ఔషధీయ గుణాలు కలిగి ఉంటాయి. పూర్వం రోజుల్లో చెరువులు, బావులు, నదుల నీరే తాగునీరు. నీటిని శుభ్రపరచడానికి ఈ పత్రాలు ఉపయోగపడతాయి.

ఉపాధి పండగ..

వినాయక చవితి పండగా చాలామంది కుమ్మరులు, శిల్పులకు ఉపాధి పండగ. స్థానిక కళాకారులకే కాకుండా రాజస్థాన్, బెంగళూరు, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు చెందిన ఎంతోమంది చేతివృత్తుల వారికి ఈ పండగ ఉపాధి కల్పిస్తుంది. జిల్లా వ్యాప్తంగా మట్టి వినాయకుని ప్రతిమల తయారీ పెద్దఎత్తున జరిగింది. రూ.500 నుంచి రూ.10 వేల దాటిన బొమ్మలు కూడా తయారీదారులు తయారు చేసి, విక్రయాలు చేశారు. ప్రతీ నియోజకవర్గంలో మూడు నుంచి ఐదు వరకు బొమ్మల తయారీ షెడ్డులు నెలరోజుల క్రితం నుంచే ఏర్పడ్డాయి. ఒక్కోచోట పది మంది కళాకారుల వరకు విగ్రహాలు తయారు చేస్తూ ఉపాధి పొందారు.

మట్టి గణపతినే పూజిద్దాం...

పర్యావరణ హితం కాంక్షిస్తూ మట్టి గణపతి విగ్రహాలనే పూజించేలా ఇప్పటికే చాలాచోట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఉచితంగా మట్టి విగ్రహాలను ఇచ్చి, ప్రోత్సహించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వాడి, పర్యావరణ కాలుష్యం చేయొద్దని, మట్టి విగ్రహాలనే వాడాలని కోరారు.

తోటపల్లి కాలువలో జారిపడి వ్యక్తి మృతి



జగన్‌మోహన్‌రావు (ఫైల్)

బాడంగి: ప్రమాదవశాత్తు తోటపల్లి కాలువలో జారిపడి గొట్టాపు జగన్‌మోహన్ రావు(47) అనే వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని జీకేఆర్ పురానికి చెందిన ఆయన పిల్లల చదువుల నిమిత్తం తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి బొబ్బిలి పూల్‌బాగ్ కాలనీలో నివాసముంటున్నారు. వినాయక చవితి పండగ కోసమని స్వగ్రామం శనివారం వచ్చిన ఆయన ఆదివారం ఉదయం బహిర్భూమి కోసం గ్రామం పక్కనే ప్రవహిస్తున్న తోటపల్లి కాలువ వద్దకు వెళ్లి, కాలుజారి అందులో పడిపోయాడు. ఈతరాకపోకవడంతో ఊపిరాడక చనిపోయాడు. ఎంతసేపటికి ఆయన ఇంటికి రాకపోవడంతో కాలువ వద్దకు వెళ్లి, కుటుంబ సభ్యులు గాలించగా, ఆయన మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆర్.జయంతి తెలిపారు.

చికిత్స పొందుతూ..

కొత్తవలస: విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మండలంలోని కొత్తవలస గ్రామానికి చెందిన కె.నర్సుమాంబ(64) ఆదివారం మృతి చెందినట్లు ఏఎస్‌ఐ రాజులు తెలిపారు. ఈ నెల 14వ తేదీన కొత్తవలస రైల్వేస్టేషన్ సమీపంలో నర్సుమాంబ తన భర్త ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, వారి వెనక నుంచి వచ్చిన ఆటో వారిని బలంగా ఢీకొనడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. అదేరోజు చికిత్స నిమిత్తం విశాఖపట్నం తరలించగా, చికిత్స పొందుతూ చనిపోయినట్లు వెల్లడించారు.

రైలు ఢీకొని..



ఆస్పత్రిలో నరేష్ మృతదేహం

పార్వతీపురం టౌన్: గూడ్సురైలు ఢీకొని తాబేలు నరేష్(30) అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ దుర్ఘటన మండలంలోని నర్సిపురం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. నర్సిపురానికి చెందిన ఈయన ట్రాక్టర్ డ్రైవర్ కాగా, రైల్వేగేటు దాటుతుండగా మృత్యువాతకు గురైనట్లు రైల్వే పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి మృతదేహం తరలించారు.

పందెంరాయుళ్ల అరెస్ట్

బాడంగి: మండలంలోని గొల్లాది సమీపంలోని ఓ తోటలో కోళ్లపందాలు ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ ఆర్.జయంతి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మధ్యాహ్నం తోటలో కోళ్లపందాల ఆట జరుగుతున్న విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి మారువేషంలో వెళ్లి, వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి నుంచి 5 కోడిపుంజులు, రూ.3100 నగదు స్వాధీనం చేసుకున్నారు.

దేవుపల్లిలో పేకాటరాయుళ్లు..

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాటశిబిరంపై పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ ఘటనలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని, అరెస్ట్ చేశారు. అనంతరం వారి నుంచి రూ.3,150 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

జామి: మండలంలోని కుమరాం గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న కోడిపందాల శిబిరంపై ఎస్‌ఐ వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడిలో పందాలు ఆడుతున్న ఆరుగురిని పట్టుకుని, వారి నుంచి రూ.41,00 నగదుతో పాటు 5 కోడిపుంజులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో శ్రీవారి(శ్రీవేంకటేశ్వరస్వామి) బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకురార్పణ చేశారు. ఆశీర్వచన మండపంలో అర్చకులు విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, దీక్షాధారణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి, అనంతరం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహించారు. ఈవో కిశోర్‌కుమార్ అర్చకులకు దీక్షావస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరిసింహాచార్యులు, కిరణ్‌కుమార్, వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో ప్రత్యేక హోమాలు..

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో ప్రత్యేక హోమాలు, పూజలు ఆదివారం నిర్వహించారు. స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించినానంతరం లోక కల్యాణార్థం యాగశాలలో



యాగశాలలో హోమాలు చేస్తున్న దృశ్యం

సుందరకాండ హవనం, ఆదిత్య హృదయ హవనం, సుదర్శన అష్టక హవనం తదితర హోమాలు చేపట్టారు. అనంతరం స్వామి వెండి మండపం వద్ద సీతారాముల నిత్య కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా చేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరిసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు

విజయనగరం: నగరంలో దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని రెండో డివిజన్ పూల్‌బాగ్ ప్రాంతంలో రూ. 8.50 లక్షలతో అభివృద్ధి చేసిన హాజీ అలీనగర్ పార్కును ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, హాజీ అలీనగర్ ప్రాంత వాసులకు ఇచ్చిన మాట ప్రకారం పార్కును అభివృద్ధి చేయడంతో పాటు వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించుకునేందుకు షెడ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే స్థానికులకు ఉపయుక్తంగా ఉండేందుకు పార్కు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గత పాలకులు నగర అభివృద్ధిని పట్టించుకోలేదని, వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి శరవేగంగా సాగుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, స్థానిక కార్పొరేటర్ బండారు ఆనందరావు, పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి ముద్దాడ మధు, కార్పొరేటర్లు గుజ్జల నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.



మరింత రుచిగా..నాణ్యతగా..

- వసతిగృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం
- డైట్‌చార్జీలు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాలోని 100 వసతిగృహాల్లో 9,392 మందికి లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థిలోకం



గంట్యాడ ఎస్సీ హాస్టల్‌లో భోజనం చేసేముందు ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

నెల్లిమర్ల: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఇప్పటికే మనబడి నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను సమూలంగా మార్చివేసింది. అలాగే ఇప్పుడు వసతిగృహ విద్యార్థుల సమస్యలపై కూడా ప్రత్యేకదృష్టి సారించింది. ఇంటి వాతావరణాన్ని తలపించేలా పసందైన భోజనాన్ని అందించేందుకు డైట్‌చార్జీలను పెంచింది.

సరికొత్త మెనూ అమలు చేస్తోంది. గతంలోని టీడీపీ ప్రభుత్వం వసతిగృహాలను అంతగా పట్టించుకోకపోవడంతో వాటి నిర్వహణ పూర్తిగా చతికిలపడింది. విద్యార్థులకు మెనూ ప్రకారం సక్రమంగా భోజనం అందిన సందర్భాలు లేవు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వసతిగృహాల్లో మౌలిక సౌకర్యాలు మెరుగుపడ్డాయి. విద్యార్థులకు బలవర్ధకమైన పౌష్టికాహారం అందేలా చేయడంతో పాటు నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో ఉండేలా చేసింది. విద్యార్థులు చదువులో చురుగ్గా రాణించాలంటే వారి ఆరోగ్యం బాగుండాలని గుర్తించిన ప్రభుత్వం విద్యార్థుల డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచింది. ఈ పెరిగిన చార్జీలతో వసతిగృహాల్లోని విద్యార్థులకు రుచికరమైన భోజనం అందుతోంది. దీనిపట్ల విద్యార్థి లోకం హర్షం వ్యక్తం చేస్తోంది.

బలవర్ధకమైన మెనూ..

ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న మెనూతో వసతిగృహాల విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందుతోంది. చికెన్‌బిర్యానీ, పూరీ, ఇడ్లీ, జీరా రైస్, ఉప్మా సేమియా, పాయసం, రసం, టమాటా బాత్, ఎగ్ టమాటా కర్రీ, చికెన్‌కర్రీ లాంటి వంటకాలతో మూడు పూటలా రుచికరంగా తింటున్నారు.

జిల్లాలో వసతిగృహాలు ఇలా..

జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖలో ప్రీ మెట్రిక్‌హాస్టల్స్, పోస్ట్‌మెట్రిక్ హాస్టల్స్ 30 ఉండగా, వాటిలో 1920 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. అలాగే బీసీ సంక్షేమ వసతిగృహాలు ప్రీ మెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ హాస్టల్స్ కలిపి మొత్తం 53 ఉండగా, అందులో 3,519 మంది విద్యార్థులుంటున్నారు. గిరిజన వసతిగృహాలు ప్రీమెట్రిక్ 8, పోస్ట్‌మెట్రిక్ 9 మొత్తం 17 ఉండగా, అందులో 3,952 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. హాస్టల్ సౌకర్యాలు మెరుగుపడడంతో పాటు మెస్(డైట్) చార్జీలు కూడా పెరగడంతో అడ్మిషన్లు కూడా అధికంగా పెరిగాయని అధికారులు చెబుతున్నారు.

గతంలో అలా.. ప్రస్తుతం ఇలా..

గత ప్రభుత్వంలో వసతిగృహాల్లో నీళ్లచారు.. ఉడకని అన్నం, రుచిలేని కూర, కనిపించని గుడ్డుతో భోజనం అధ్వానంగా ఉండేది. డైట్ చార్జీలు అరకొరగా ఇచ్చేవారు. పర్యవేక్షణ కూడా కరువై మెనూ సక్రమంగా అమలయ్యేది కాదు. విద్యార్థులు అర్ధాకలితో అలమటించేవారు. ప్రస్తుతం వారంలో ఏడు రకాల అల్పాహారం, మూడు రోజులు చికెన్‌కర్రీ, ప్రతిరోజూ ఉడకబెట్టిన గుడ్డు, ఉదయం పాలు, వేరుశనగ చిక్కీ, రాత్రి భోజనం అనంతరం అరటిపండు ఇస్తున్నారు. హాస్టల్లో మెనూ పక్కాగా అమలవుతోంది. డైట్ చార్జీలు పెరగడంతో విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన పౌష్టికాహారం అందుతోంది.

భోజనం బాగుంది..



మా హాస్టల్‌లో ఇప్పుడు భోజనం చాలా బాగుంది. మాకు ప్రతిరోజూ రుచికరమైన భోజనంతో పాటు స్నాక్స్ ఇస్తున్నారు. గతంలో ఇలాంటి భోజనం ఉండేది కాదు.

–వై.దుర్గాప్రసాద్, హాస్టల్ విద్యార్థి, విజయనగరం.

పక్కాగా మెనూ అమలు..



వసతిగృహాల్లో చదువుకునే విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్న సదుద్దేశ్యంతో కొత్త మెనూను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అందుకు అనుగుణంగా మెనూను పక్కాగా అమలు చేస్తున్నాం. విద్యార్థులు సంతోషంగా వసతిగృహాల్లో ఉంటున్నారు.

–ఎం.యశోదనరావు, జిల్లా బీసీ సంక్షేమాధికారి, విజయనగరం.